ప్రజాశక్తి
బుధవారం 30 ఏప్రిల్ 2025
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి





విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న సింహగిరి

చందనోత్సవానికి సర్వం సిద్ధం

- సుమారు 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- ఐదు గంటల వరకే విఐపి క్యూలైన్

వార్త 4లో..

పెరిగిన ధరలతో..

బంగారం దుకాణాలు వెలవెల

- అక్షయ తృతీయ ఆశలు గల్లంతు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: నగరంలో బంగారం దుకాణాలు కొనుగోలు దారులు లేక వెలవెలబోతున్నాయి. ఒకవైపు పెళ్లిళ్ల సీజన్, మరోవైపు అక్షయ తృతీయ వంటి ముఖ్యమైన పండగ ఉన్నప్పటికీ బంగారం కొనుగోళ్లు బాగా మందగించడంతో వ్యాపారస్తులు గగ్గోలు పెడుతున్నారు. ద్వారకానగర్, ఆశీల మెట్ట ప్రాంతాలు పెద్దపెద్ద బంగారం షాపులు ఉన్న ప్రదేశాలు అక్షయ తృతీయ వంటి అతి ముఖ్యమైన పండగ సందర్భంగా ఈ ప్రాంతంలో ఉన్న బంగారం దుకాణాలు, కొనుగోలుదారులతో రద్దీగా ఉంటాయి. అయితే ఈసారి ఆ పరిస్థితి లేదు. అలాగే పూర్ణా మార్కెట్, కురుపాం మార్కెట్, టౌన్ కొత్తరోడ్డు ప్రాంతాలలో పలు బంగారం దుకాణాలు ఉన్నాయి. అక్కడ కూడా ఇదే పరిస్థితి నెలకొంది. బుధవారం అక్షయ తృతీయ, ఇదే రోజున సింహాచలం చందనోత్సవం జరుగుతోంది. అక్షయ తృతీయ రోజున ఎంతోకొంత బంగారం కొనుగోలు చేస్తే, ఆ ఏడాది అంతా శుభం

మిగతా 2లో..


సమావేశంలో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ, చిత్రంలో కెఎస్.చలం, సోహన్ హటంగడి

అదాని కోస్ట్‌గా విశాఖ తీర ప్రాంతం

వార్త మెయిన్‌లో..

మొదటి పేజీ తరువాయి..

పెరిగిన ధరలతో..
బంగారం దుకాణాలు వెలవెల

జరుగుతుంది అనేది పలువురి నమ్మకం. ఎన్నడూ లేని విధంగా ఈసారి బంగారం దుకాణాలకు ఇటువంటి దుస్థితి కలగడం ఇదే మొదటిసారి అంటున్నారు. ఈ పరిస్థితికి కారణం, బంగారం ధర అనూహ్యంగా పెరగడమేనంటున్నారు. ఎన్నడూ లేని విధంగా 10 గ్రాముల మేలిమి బంగారం (24 క్యారెట్స్) ధర ఈసారి రూ.97,500గా ఉంది. ఈ లెక్కన తులం బంగారం ధర రూ.లక్షా 10 వేలు అవుతుంది. ధర ఆకాశంలో ఉండడంతో, కొనుగోలుదారులను ఆకర్షించడం కోసం పెద్దపెద్ద బంగారం దుకాణాల వారు అనేక రాయితీలు ప్రకటించారు. గ్రాము బంగారం ధరపై రూ.300 తక్కువగా ఇస్తామని ఒకరంటే, రూ.500 తగ్గించి ఇస్తామని మరొకరు ప్రకటనలు చేశారు. కొందరైతే కొనుగోలు చేసిన ఆభరణాలకు వాటిని తయారుచేసే ఛార్జీలను తగ్గించి ఇస్తామంటూ ప్రచారం చేశారు కూడా. ఇన్ని జరిగినా, అక్షయ తృతీయ ఈసారి తమను కాపాడుతుందా...? లేదా అని వ్యాపారులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

సిహెచ్‌ఒల సమస్యలను పరిష్కరించాల్సిందే..



ధర్నా చేస్తున్న సిహెచ్‌ఒలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా, గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండోరోజైన మంగళవారమూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా కొనసాగింది. శిబిరాన్ని సందర్శించిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ విశాఖ ఆరోగ్యశాఖలో ఎంతో కీలకమైన విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎంఎస్ఎన్.ప్రజ్ఞ, కార్యదర్శి జి.సుధ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలన్నారు. ఇపిఎఫ్‌ను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుండి సిహెచ్‌ఒలకు మినహాయింపునివ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జి.సుధారాణి, పి.దివ్య, బి.శ్రావణి, టి.మోషే, జస్వంత్ పాల్గొన్నారు. పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు మద్దతు తెలిపారు.

మహనీయుడు అంబేద్కర్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : డాక్టర్ బిఆర్. అంబేద్కర్ 134వ జయంతిని విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పోర్ట్ పరిపాలనా భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో అంబేద్కర్ విగ్రహానికి పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ మహనీయుడని కొనియాడారు. ఆయన సేవలు చారిత్రాత్మకమన్నారు. పోర్టు ఎస్‌సి, ఎస్‌టి అధికారుల సంఘం అధ్యక్షులు జి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఎం.దేవీశ్వరరావు, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఒ.రామలింగం, కార్యదర్శి జి.శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోర్ట్ అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్, డిప్యూటీ ఛైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబె, ప్రధాన విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్.స్వామి పాల్గొన్నారు. ఇటీవల జరిగిన పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఫిర్యాదులపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఇప్పటివరకూ వచ్చిన ఫిర్యాదులపై విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ సంస్థ కార్యాలయంలో మంగళవారం ఉదయం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ప్రణాళికాధికారి శిల్పా, ప్రణాళికాధికారులు అరుణవల్లి, మౌనిక, సహాయక ప్రణాళికాధికారులు, పరిపాలనాధికారులు పాల్గొన్నారు.

సొనాటా గోల్డ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ప్రముఖ వాచ్ బ్రాండ్ సొనాటా తన అద్భుతమైన సొనాటా గోల్డ్ కలెక్షన్‌ను అక్షయ తృతీయ సందర్భంగా పరిచయం చేసిందని సంస్థ బ్రాండ్ హెడ్ ప్రతీప్‌గుప్తా తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆకర్షణీయంగా దీనిని రూపొందించడం జరిగిందన్నారు. ఇది కేవలం ఒక సంప్రదాయంగా మాత్రమే కాకుండా, వ్యక్తిగత శైలిని మరింత పెంచుతుందన్నారు.

అభ్యంతరాలు వినిపిస్తున్నా.. మౌనమేనా ?

- తెలుగు జాతి వైతాళికులను ప్రభుత్వం విస్మరించడం తగదు
- ఇప్పటికైనా వారి పేర్లు చేర్చి సవరించిన జాబితాను ప్రకటించాలి
- ఉత్తరాంధ్ర సాహితీవేత్తల ఇష్టాగోష్టిలో తీర్మానం



మాట్లాడుతున్న తెలకపల్లి రవి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తెలుగు జాతిని మేల్కొలిపిన వైతాళికులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమమవుతున్నా.. ఇంకా మౌనం దేనికని సాహితీవేత్తలు, కవుల సమావేశంలో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల కొందరి ప్రముఖుల జాబితాను ప్రకటించి వారి జయంతి, వర్ధంతులను జరపాలని చేసిన నిర్ణయం మంచిదే అయినా ప్రముఖ తెలుగు కవుల పేర్లు ఆ జాబితాలో లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా వారి పేర్లు చేర్చి సవరించిన జాబితాను ప్రకటించాలని తీర్మానం చేశారు. సోమవారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉత్తరాంధ్ర కవులు, రచయితల ఇష్టాగోష్టి జరిగింది. దీనిలో పై తీర్మానాన్ని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ, సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవిఎస్.శర్మ ప్రవేశపెట్టారు. గురజాడ, కందుకూరి, గిడుగు వంటి మహనీయుల పాత్రను తెలుగు ప్రజలు ఏనాటికీ మరచిపోరని ఈ సమావేశం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొందరి ప్రముఖుల జాబితాను ప్రకటించి వారి జయంతి, వర్ధంతులను జరపాలని చేసిన నిర్ణయం మంచిదేనని.. అయితే అందులో ప్రముఖ తెలుగు కవుల పేర్లు లేకపోవడం తీవ్ర అభ్యంతరకరమని ఈ సమావేశం పేర్కొంది. ఒకవేళ ప్రభుత్వం యాధృచ్ఛికంగా విస్మరిస్తే ఇప్పటికైనా ఆ తప్పును దిద్దుకుని జాబితాను తగిన రీతిలో సవరించి తెలుగు జాతి వైతాళికుల పేర్లను చేర్చి ఒక ప్రకటన చేయాలని కోరింది. ప్రస్తుత జాబితాపై అభ్యంతరాలు వస్తున్నా ఇంకా మౌనంగా ఉండడం చూస్తే మహనీయుల పేర్లను కావాలనే ప్రభుత్వం విస్మరించినట్లుగా భావించాల్సి వస్తుందని అభిప్రాయపడింది.

ఇష్టాగోష్టిలో 50 మంది ఉత్తరాంధ్ర కవులు

'ఉత్తరాంధ్ర సాహితీ వీచికలు' అన్న పేరుతో జరిగిన ఉత్తరాంధ్ర కవులు, రచయితల ఇష్టాగోష్టిలో 50 మంది కవులు, రచయితలు, సాహితీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సాహితీ ప్రస్థానం ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు చీకటి దివాకర్ అధ్యక్షత వహించారు. తెలకపల్లి రవి చర్చను ప్రారంభిస్తూ ఉత్తరాంధ్ర ప్రాంతం తెలుగు సాహిత్యంలో కీలక భూమిక పోషిస్తూ వచ్చిందని, దానిని రాబోయే కాలంలోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన చర్చలో పలువురు రచయితలు, కవులు పాల్గొని విలువైన సూచనలు చేశారు. ఎఎస్.రవిశేఖర్, ఎవిఆర్‌కె.మూర్తి, జెపి.శర్మ, పాయల మురళీకృష్ణ, కె.సంతోషం, భుజంగరావు, జి.రంగబాబు, వృద్ధుల కల్యాణ రామారావు, యు.అప్పలరాజు, పరవస్తు ఫణిశయనసూరి, కేతవరపు శ్రీనివాస్, ఉప్పాడ రాము, చెల్లూరు సాంబమూర్తి ప్రభృతులు తమ ప్రసంగాలతో చర్చలను సుసంపన్నం చేశారు.

అత్యాధునిక పిల్లల కేన్సర్ విభాగం ప్రారంభం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శశి సుంకర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సయాన్ కేన్సర్ క్లినిక్స్, ఓమ్ని హాస్పిటల్స్ భాగస్వామ్యంతో విశాఖపట్నంలో అత్యాధునిక పిల్లల కేన్సర్ విభాగాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సయాన్ కేన్సర్ క్లినిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ శశి సుంకర్, ఓమ్ని హాస్పిటల్స్ హెడ్ ఆఫ్ పీడియాట్రిక్స్ డాక్టర్ కె.రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ విభాగం ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందిస్తుందన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ప్రత్యేకించి పిల్లల కోసం రూపొందించిన మల్టీ-డిసిప్లినరీ కేన్సర్ చికిత్సా కేంద్రంగా ఇది నిలువనుందన్నారు. పిల్లల కేన్సర్ వైద్యులు, పిల్లలకు అనుకూలమైన చికిత్సా విధానాలు, మానసిక మద్దతు, పోషకాహార సేవలు అన్నీ ఒకే చోట అందుబాటులో ఇక్కడ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సయాన్ కేన్సర్ క్లినిక్స్ ప్రతినిధులు డాక్టర్ భారతీదేవి, డాక్టర్ రాఘవేంద్ర నాయక్, డాక్టర్ వెంకట సుష్మ, డాక్టర్ గౌరి నాయుడు, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, సుభాష్, ఓమ్ని ఆర్కే వైద్య నిపుణులు డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సిఎస్ఇఎం
సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేదాంత లిమిటెడ్ అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ ద్వారా తూర్పు తీరంలోని కృష్ణ గోదావరి డీప్ వాటర్ ప్రాంతంలో ఆయిల్, గ్యాస్ అన్వేషణ కోసం త్రీడీ కంట్రోల్డ్ సోర్స్ ఎలక్ట్రోమ్యాగ్నేటిక్ (సిఎస్ఇఎం)తో కృషి చేస్తున్నట్టు కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ హితేష్ వైద్ తెలిపారు. మంగళవారం ఉదయం హెచ్‌బి కాలనీ సమీపంలోని వేదాంత లిమిటెడ్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎస్ఇఎం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు నార్వేజియన్ కంపెనీ అయిన ఇఎంజిఎస్‌తో భాగస్వామ్యం రూపొందించుకున్నామన్నారు.

'ఉర్సా'కు భూ కేటాయింపులు రద్దు చేయాలి

తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ హిల్ నెంబర్ 3లో టిసిఎస్‌కు కేటాయించిన దగ్గరే 3.6 ఎకరాల భూమిని, కాపులుప్పాడలో 56ఎకరాలు భూమిని పేరూఊరు లేని బోగస్ కంపెనీ ఉర్సా క్లస్టర్ ప్రయివేటు లిమిటెడ్‌కు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేటాయించిన భూములను తక్షణమే వెనుక్కు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉర్సా సాఫ్ట్‌వేర్ కంపెనీకి భూ కేటాయింపును నిరశిస్తూ మంగళవారం ఉదయం విశాఖ రూరల్ తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, రెండు నెలలు క్రితం రిజిస్ట్రేషన్ అయిన బోగస్ కంపెనీకి విలువైన ప్రభుత్వ భూములను ఉద్యోగాల పేరిట కేటాయించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. ఉర్సా కంపెనీ యజమాని ఎవరో తెలియదు. సాఫ్ట్‌వేర్ మార్కెట్లో దానికున్న గుర్తింపు, ఇప్పటివరకు సాధించిన విజయాలు, ఎంత మందికి ఉపాధి కల్పించింది వంటి అంశాలను పరిశీలించకుండా భూములు కేటాయించిందంటే రాష్ట్ర కూటమి ప్రభుత్వ పెద్దలకు బినామీ కంపెనీ అని అనుమానించాల్సి వస్తుందన్నారు. నేడు లక్షలాది మంది పేదలు సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ భూములను ప్రయివేటువారికి కట్టబెట్టడం సరైంది కాదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పన పేరుతో ప్రయివేటు వారికి ప్రభుత్వ భూములు ఇవ్వడంకంటే ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయిస్తే లక్షలాది మందికి శాశ్వత ఉపాధి లభిస్తుందన్నారు. ఇప్పటికే విశాఖపట్నంలో ఐటి సంస్థలతో చేసుకున్న ఎంఒయుల ప్రకారం ఎంతమందికి ఉపాధి కల్పించాయో సమీక్ష చేస్తే ఈ కంపెనీల భాగోతం తేటతెల్లమవుతోందన్నారు. అతితక్కువ వేతనాలు చెల్లిస్తూ రోజుకు 12 గంటలకుపైగా పనిచేయించుకుంటున్నాయని తెలిపారు. ప్రభుత్వ భూములను ప్రజా ప్రయోజనాలకే వినియోగించే విధంగా ప్రజా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు డి.అప్పలరాజు, వి.నరేంద్రకుమార్, జోన్ కమిటీ సభ్యులు పి.శంకరరావు, కె.కుమారి, ఐసి.నాయుడు, పి.రాజ్‌కుమార్, డి.కొండమ్మ, డి.నాగరాజు, ఎం.లక్ష్మి, ఎన్‌వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జాతీయరహదారిపై వారపుసంత సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి అక్కడకక్కడే మృతి చెందాడు. మండలంలోని సీతంపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్ కం డ్రైవర్ ప్రసాదుల భాస్కరరావు, మడగా రమణ (శ్రీను), మేకల నాగేంద్ర ట్రాక్టర్‌పై అడ్డురోడ్డు వైపు వెళుతుండగా నక్కపల్లి వారపు సంత దాటగానే వెనుక నుంచి వస్తున్న ట్యాంకర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ముందుకు దూసుకుపోయి రోడ్డు పక్కన కూర్చున్న గొర్రెల కాపరి మామిడి సత్తిబాబుపై బోల్తా పడింది. ఈ ఘటనలో మామిడి సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, విశాఖపట్నం ఆసుపత్రికి తరలించారు. వీరిలో ప్రసాదుల భాస్కరరావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మండలంలోని సారిపల్లిపాలెం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మామిడి సత్తిబాబు రోడ్డుకు ఆనుకుని ఉన్న కొబ్బరి తోటలో మేకలు మేపుతూ, వచ్చి రోడ్డు పక్కన కూర్చున్నాడు. ఇంతలోనే మృత్యువు ట్రాక్టర్ రూపంలో వచ్చి కబళించడంతో ఆయన కుటుంబ సభ్యులు బోరును విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంలో ఒక మేక కూడా మృత్యువాత పడింది.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని చోడవరం వెళ్లే రోడ్డులో పాత సబ్బవరం జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం విశాఖ నుంచి చోడవరం వెళ్తున్న 300సి బస్సు స్కూటరిస్టును ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామానికి చెందిన సత్యవరపు శ్రీనివాసరావు (55) సబ్బవరం జోడుగుళ్ల వద్ద కిరాణా, తినుబండారాల హోల్‌సేల్ వ్యాపారం చేస్తుంటారు. ఆయన మంగళవారం స్కూటీపై సబ్బవరం నుండి చోడవరం రోడ్డులో వెళ్తూ పాత సబ్బవరం జంక్షన్ వద్ద యూటర్న్ చేస్తుండగా, ఆ సమయంలో వెనుక నుండి వస్తున్న విశాఖ- చోడవరం 300 సి బస్సు ఆయనపై నుండి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానిక ఎస్సై టి.దివ్య తెలిపారు. మృతుని కుమారుడు సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మత్స్యకారుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని అన్నవరం సముద్ర తీరానికి మత్స్యకారుని మృతదేహం మంగళవారం చేరింది. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక బోయివీధికి చెందిన మత్స్యకారుడు చింతపల్లి తాతారావు (60) జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం ఉప్పుటేరు వద్ద సోమవారం చేపల వేటకు వెళ్లాడు. వేటాడుతున్న క్రమంలో ఉప్పుటేరుకు అనుకుని సముద్రం ఉండడంతో అలల తాకిడికి గురై సముద్రంలో కొట్టుకుపోయాడు. మృత దేహం అన్నవరం సముద్ర తీరంలో మంగళ వారం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతునికి భార్య, పైడమ్మ, ముగ్గురు కుమారులు పోలిరాజు, అప్పన్న, నూకరాజు, కుమార్తె నందిని ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద మేడే పోస్టర్‌ను మంగళవారం యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, మే డే ప్రాధాన్యతను వివరించారు. మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణ కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సవరించి, నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని తెలిపారు. ఇందుకు నిరసనగా మే 20వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, నీలాతి రాము, నమ్మి నాయుడు, పల్లా పెంటరాజు, పల్లా రమణ, పంపాన సూర్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలుంటే అవకాశాలు

- ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి-మధురవాడ : యువతకు నైపుణ్యాలుంటే అవకాశాలు వస్తాయని గీతం అధ్యక్షులు, ఎంపీ శ్రీభరత్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేధికగా మంగళవారం అమర్‌రాజా సంస్థ నిర్వహించిన ఉద్యోగమేళాలో ఆయన పాల్గొని ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. పదవ తరగతి నుంచి ఇంటర్, ఐటిఐ నుంచి పాలిటెక్నిక్ అర్హత గల వారికి అమర్‌రాజా సంస్థ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. యువతరం అమర్‌రాజా వంటి సంస్థలు ఇచ్చే శిక్షణ పొందడం ద్వారా అదనపు అర్హతలను సాధించాలని, తద్వారా అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ ఉద్యోగ మేళాకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 3 వేల మంది యువత తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. ఉదయం నుంచే యువత పెద్ద ఎత్తున గీతం ప్రాంగణానికి తరలివచ్చారు. మొత్తం 1172 మందిని ఎంపిక చేసినట్లుగా అమర్‌రాజా ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగ మేళా ప్రారంభోత్సవ కార్యక్రమంలో గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ పాల్గొని ప్రసంగించారు.



నియామకపత్రాలు అందుకున్న వారితో ఎంపీ శ్రీభరత్

టెన్త్ విద్యార్థులకు సన్మానం, బహుమతులు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆనందపురం : భీమిలి నియోజకవర్గంలో 10వ తరగతిలో ఎక్కువ మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు భీమిలిలోని పార్టీ ఆఫీసులో ఎమ్మెల్యే గంగి శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ సన్మానం చేశారు. అనందపురం మండల స్థాయిలో 579 మార్కులతో మూడో స్థానంలో నిలిచిన కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థిని ఎస్.ఢిల్లీశ్వరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, కెజిబివి ప్రిన్సిపల్ ఎస్.లావణ్య, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బమ్మిడి ఉమ, స్కూల్ కమిటీ చైర్మన్ కోరుకొండ శివాజీ, వైస్ చైర్మన్ ఒలిరెడ్డి మంగఅప్పన్న, తారక్ పాల్గొన్నారు

ములగాడ : 62వ వార్డు పరిధి ఎఎస్ఎస్ఆర్.కాలనీలో నివాసముంటున్న టిడిపి నాయకులు సుభాషిని సూర్యనారాయణల కుమార్తె ప్రవళిక పదో తరగతి పరీక్షలలో 591 మార్కులు సాధించిన సందర్భంగా ఆమెను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పిజివిఆర్.నాయుడు (గణబాబు) సత్కరించారు. అనంతరం జివిఎంసి మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పీలా శ్రీనివాసరావును కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు మజ్జి మాలినాయుడు, నాయకులు దిలీప్‌కుమార్, కనకరాజు జోగాలమ్మ, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, మహాలక్ష్మమ్మ, పద్మ పాల్గొన్నారు.

భీమునిపట్నం : టెన్త్ పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో ప్రతిభ కనబరిచిన నియోజక వర్గ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గంటా నారాయణమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, ద్వితీయ స్థానానికి రూ.3 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.2 వేలు చొప్పున మొత్తంగా 15 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజ అందజేశారు.

నగదు బహుమతులు అందుకున్న వారిలో స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాల, చిట్టివలస జెడ్పీ బాలికలు, బాలురు ఉన్నత పాఠశాలలు, భీమిలి మండలం తాళ్లవలస, మజ్జిపేట, ఆనందపురం మండలం గిడిజాల, గొట్టిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలు, అదే మండలం కెజిబివి, పద్మనాభం మండలం ఆర్‌వి.పురం, బిఆర్.తాళ్లవలస జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉన్నారు. జివిఎంసి రెండో జోన్, చినగదిలి అడవివరం, చంద్రం పాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు, సింహాచలం బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎంఇఒలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడు మురళీ మోహనరావు

ఉద్యోగ విరమణ సభలో వక్తల ప్రశంస

ప్రజాశక్తి -తగరపువలస : నిబద్ధత గల ఉపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు అని పలువురు వక్తలు కొనియాడారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ పొందనున్న సందర్భంగా చిట్టివలసలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మురళీ మోహనరావు దంపతులను మంగళవారం ఘనంగా సన్మానించారు. మురళీమోహనరావు తల్లి అనసూయమ్మను తొలుత సన్మానించారు. ముఖ్య అతిధులుగా హాజరైన ప్రభుత్వ విప్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి సభ్యులు వేపాడ చిరంజీవిరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు తదితరులు మాట్లాడుతూ, వృత్తి పట్ల మురళీ మోహనరావుకు ఉన్న అంకితభావం, నిబద్ధత ఎంతో గొప్పదని ప్రశంసించారు. నేటి ఉపాధ్యాయులకు ఆయన ఎంతో స్ఫూర్తి అని కొనియాడారు. తనను ఇంతగా సన్మానించి, అభిమానించిన వారందరికీ పేరు పేరునా మురళీ మోహనరావు ధన్యవాదాలు తెలిపారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం నమ్మి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, సర్పంచ్ జివి.నారాయణ, విద్యా శాఖ ఆర్‌జెడి, బి.విజయభాస్కర్, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, డిప్యూటీ డిఇఒ ఎ.సోమేశ్వరరావు, సమగ్ర శిక్ష ఎపిసి చంద్రశేఖర్, ఎంఇఒ ఎం.శివరాణి, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, కుటుంబ సభ్యులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మురళీమోహనరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చందనోత్సవానికి సర్వం సిద్ధం

- సుమారు 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- ఐదు గంటల వరకే వివిపి క్యూలైన్

ప్రజాశక్తి-గోపాలపట్నం : సింహాచలం శ్రీ లక్ష్మీనృసింహస్వామి నిజస్వరూప దర్శనం నేడు లభించనున్నది. దేవాదయశాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి ఆదేశాల మేరకు చందనోత్సవానికి విచ్చేసిన భక్తులకు లడ్డు ప్రసాదం, మంచినీరు బాటిళ్లు, బిస్కెట్లు, చంటి పిల్లల కోసం పాలు పంపిణీకి సిద్ధంచేశారు. టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు స్లాట్ సమయానికి రెండు గంటల ముందు క్యూ లైన్‌లోనికి అనుమతిస్తారు. ఎటువంటి సమాచారం కోసమైనా భక్తులు సంప్రదించేందుకు 0891-275666 నెంబరును కేటాయించారు. భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, చలువ పందిళ్లు ఏర్పాటుచేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సుమారు రెండువేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల కారణంగా భక్తులు సంఖ్య స్వల్పంగా తగ్గినప్పటికీ ఈ ఏడాది పూర్తిస్థాయిలో భక్తులు వచ్చే అవకాశం ఉందని ఆలయ వర్గాలు అంచనా వేశాయి. అప్పన్న దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఇప్పటి నుంచే అనేక స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాలు మజ్జిగ కేంద్రాలను, టీ, టిఫిన్లు, ఇతర తినబండాల స్టాళ్లను ఏర్పాటుచేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

సింహాచలం శ్రీ వరహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవం ఏర్పాట్లను విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ మంగళవారం ఉదయం పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, ఇతర డిప్యూటీ కలెక్టర్లు, సింహాచలం ఈవో, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఇ, ఇతర అధికారులతో కలిసి చందనోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ పరిస్థితులను గమనించి సంబంధిత అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఏర్పాట్లను సమీక్షించే నిమిత్తం డ్రై రన్ నిర్వహించిన అధికారులు అక్కడ పరిస్థితులను ప్రత్యక్షంగా గమనించారు. చందనోత్సవం రోజున ఏయే శాఖల అధికారుల ఎలాంటి చర్యలు తీసుకోవాలని అనే అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పరచుకున్నారు. కొన్ని అంశాలపై కలెక్టర్ ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

దర్శనాల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా అనౌన్స్ చేయించాలని, విరివిగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెప్పారు. అనంతరం ప్రధాన ద్వారం గూండా ఆలయంలోకి చేరుకున్న ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. రూ.1000, రూ.1500 టిక్కెట్ల భక్తులు ఆలయంలోకి చేరుకునే మార్గాలను పరిశీలించారు. నిజరూప దర్శనం నిమిత్తం వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వేరుగా ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పోలీసు సిబ్బంది చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ, పోలీసు, రెవెన్యూ, జివిఎంసి, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్ తదితరులు

15 వైద్య శిబిరాలు : డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి -సీతమ్మధార : సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన భక్తుల సౌకర్యార్థం 15 వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. సింహాచలం కొండపైన 8, కొండ దిగువన 7 వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొనానరు. ఈ వైద్య శిబిరాల్లో వైద్యాధికారి, పారా మెడికల్ సిబ్బందితో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి బుధవారం చందనోత్సవం పూర్తయ్యేంతవరకు ఉంటాయని తెలిపారు. ఈ వైద్య శిబిరాలకు అనుబంధంగా 16 ఎఎల్ఎస్ అంబులెన్సులను అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు ప్రత్యేక వైద్య నిపుణులు, పారామెడికల్ సిబ్బంది చందనోత్సవం పూర్తయ్యేరకూ అందుబాటులో ఉంటారని తెలిపారు. భక్తుల అవసరార్థం మెడికవర్, అపోలో, విమ్స్ కెజిహెచ్‌లను రిఫరల్ కేంద్రాలుగా ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. కొండపైన ఉన్న పబ్లిక్ అమినిటిస్ సెంటర్‌లో 6 పడకలతో తాత్కాలిక వైద్య సదుపాయం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 9949285370 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అసాంఘిక కార్యక్రమాల సమాచారం అందించాలి

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో సేవలందిస్తున్న గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులతో ఎఎస్ఐ కాళీప్రసాద్ మంగళవారం సమావేశం నిర్వహించారు. చిన్నముషివాడ, రాజ్యలక్ష్మి ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యదర్శులు తమ పరిధిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి సేవనము, విక్రయించేవారి గురించి సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంపై చర్చించారు. ముఖ్యమైన హాట్ స్పాట్ ప్రాంతాలలో వీటిని ఏర్పాటుచేయాలని మార్గనిర్దేశం చేశారు. సున్నితమైన సమాచారం, మైనర్లపై అత్యాచారాలు, గృహహింస, చిల్లర నేరాలు మొదలైన వాటిపై కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి, తక్షణమే ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. మహిళా బాధితులకు సహాయం రిఫరల్ సేవలు అందించేందుకు మహిళా సంరక్షణ కార్యదర్శులు ప్రధాన పాత్ర పోషించాలని ఎఎస్ఐ ఖాళీ ప్రసాద్ సంరక్షణ కార్యదర్శులకు సూచించారు.

అప్సా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రాము



ప్రజాశక్తి-సీతమ్మధార : ఎపి ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ అప్సా రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా విశాఖకు చెందిన శ్రీ నవోదయ జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ బిశెట్టి రాము నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన ఎపి ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ సర్వసభ సమావేశంలో రామును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయివేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి సమర్థవంతంగా కృషి చేస్తానని చెప్పారు. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పలు జిల్లాల ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మలేరియా విభాగం ఉద్యోగికి సత్కారం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డు మలేరియా విభాగంలో వర్కర్‌గా విధులు నిర్వహించి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన కాసా సుర్యప్రకాశరావును నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సత్కరించారు. శాంతినగర్‌లోని పారిశుధ్య కార్యాలయంలో మంగళవారం సూర్యప్రకాశరావు ఉద్యోగ విరమణ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో పారిశుధ్య, మలేరియా విభాగాల అధికారులు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. రూ.8.20 లక్షల చెక్కులను అందించారు. ఉత్తర నియోజకవర్గంలో ఆరోగ్యశ్రీ వర్తించని వారు సిఎం రిలీఫ్ ఫండ్ కింద పెట్టుకోవచ్చని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నజీర్, సురేష్‌కుమార్, ఈతలపాక సుజాత తదితరులు పాల్గొన్నారు.



రవి కుటుంబానికి సహాయం అందిస్తున్న టిడిపి నాయకులు

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం, గొట్టిపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త చింతాడ రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ బీమా కింద రూ.5 లక్షల చెక్కును, ప్రజాసేవకుడు, శ్రీ మహాలక్ష్మి అసోసియేషన్ అధ్యక్షులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోసు తన సొంత నిధులు రూ.50 వేలు కలిపి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిపల్లి మాజీ సర్పంచ్ కోరాడ నాయుడుబాబు, తెలుగుదేశం నాయకులు సుంకరి శివ, తాడివాడ శివకృష్ణ, కోరాడ తమ్మునాయుడు, కోరాడ శంకర్, బర్ల రామునాయుడు, కొలగాని రమణ, కోరాడ శ్రీను, సారిపల్లి అప్పలరాజు, జనసేన నాయకుడు జానా కృష్ణ, దొంతల శ్రీరామ్ పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలి



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు పద్మ

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ అపాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి డిమాండ్‌చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 211వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో వారు మాట్లాడుతూ, పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్పందించాలన్నారు. హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకోవాలని కోరారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ నిర్ణయం అనైతికమన్నారు. హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని, సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రయివేటుకు అప్పగించడం దారుణమని పేర్కొన్నారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ నిర్ణయం కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, కె.అనురాధ, కె.పార్వతి, కె.జనార్ధనమ్మ, కె.సంతోషం, జి.మణి, లీలావతి, వి.లక్ష్మి, ఎస్.విజయలక్ష్మి, వి.ప్రభావతి, సిహెచ్.సుమిత్ర, ఒ.విజయ, ఆర్.భవాని తదితరులు పాల్గొన్నారు.



జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కెకె.రాజు

జగన్‌ను కలిసిన కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. విశాఖపట్నం జిల్లా అధ్యక్షులుగా నియమితులైన కెకె.రాజు సమావేశం అనంతరం జగన్మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

జూ పార్కులో జంతు ఆరోగ్య కమిటీ సమావేశం

ప్రజాశక్తి - ఆరిలోవ : జంతువుల ఆరోగ్యం, శ్రేయస్సు దృష్ట్యా ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల జంతు ఆరోగ్య కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. జూ క్యూరేటర్ జి.మంగమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హైదరాబాద్ నెహ్రూ జంతు ప్రదర్శనశాల డిప్యూటీ డైరెక్టర్ (రిటైర్డ్) ఎం.నవీన్‌కుమార్, విశాఖ ఎహెచ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎడిడిఎల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి.మోహిని కుమారి, జివిఎంసి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.కిషోర్, విపిసి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.మహేష్ జూ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ పి.భాను బాబు హాజరయ్యారు. జంతువులకు సరైన సంరక్షణ, సంక్షేమాన్ని నిర్ధారించేందుకు జంతువుల పోషణ, ఆరోగ్య సంరక్షణ చర్యలు, జంతు వైద్య చికిత్స ప్రొటోకాల్, వేసవిలో జంతువుల సంరక్షణకోసం తీసుకోవలసిన ప్రత్యేక చర్యలు, యానిమల్ ఎన్రిచ్‌మెంట్ వంటి అంశాలపై కమిటీ సమగ్రంగా చర్చించింది. ఇటీవల మూత్రపిండాల వ్యాధికి గురైన 19 ఏళ్ల చిరుత హర్షపై ప్రత్యేక దృష్టి సారించి, తగు సూచనలు సలహాలు అందజేశారు. మార్మోసెట్‌లు, స్క్విరల్ కోతులు, మీర్కాట్‌లు, జిరాఫీలు, రాయల్ బెంగాల్ పులులు, తెల్ల పులులు, సింహాలు, హైనాలు, స్లాత్ ఎలుగు బంటులు, వాటర్ మానిటర్ బల్లులు, ఆఫ్రికన్ చిలుకల సంతానోత్పత్తిపై పలు రకాల సూచనలు, సలహాలు అందజేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గిడిజాల సబ్ స్టేషన్ పరిధి గిడిజాల హెడ్ క్వార్టర్, గిడిజాల రూరల్ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎఇ మండల అప్పలనాయుడు తెలిపారు. గిడిజాల, వేమగొట్టిపాలెం, లక్ష్మీదేవిపేట, ముచ్చెర్ల, తంగుడుబిల్లి హౌసింగ్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, గృహ, పారిశ్రామిక, వ్యవసాయ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పేదరిక నిర్మూలనకు మార్గదర్శులను గుర్తించాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

పేదరిక నిర్మూలనలో భాగంగా మార్గదర్శులను గుర్తించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పేదరిక నిర్మూలన 'మార్గదర్శి-బంగారు కుటుంబం పి4 జీరో పోవర్టీ' కార్యక్రమంపై నియోజకవర్గ/ మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపాల్ కమిషనర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పి4 సర్వే ద్వారా గుర్తించిన అట్టడుగు వర్గాల్లో ఉన్న 20 శాతం కుటుంబాలను ఆదుకోవడం కోసం సమాజంలో సేవా దృక్పథం కలిగిన మార్గదర్శులను గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 64,475 బంగారు కుటుంబాలను పి4 సర్వే గుర్తించడం జరిగిందని చెప్పారు. సేవా గుణం ఉన్న ఉన్నత స్థాయి వ్యక్తులు zeropoverty.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో మార్గదర్శిగా పేరు నమోదు చేసుకోని తమకు నచ్చిన కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, డిఆర్‌డిఎ పీడీ శచీదేవి, జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, వివిధ శాఖల అధికారులు

పశు వైద్యులు రైతులకు అందుబాటులో ఉండాలి

పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న వైద్యులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పశు వైద్యులు పాడి రైతుల అభివృద్ధికి దోహదపడే విధంగా పని చేయాలన్నారు. నిత్యం ప్రజల వద్దకు అందుబాటులో ఉండే సంచార పశు వైద్య వాహనాలు జిల్లాలో ఎన్ని ఉన్నాయి, వాటి పనితీరుపై నివేదిక అందించాలని అసిస్టెంట్ డైరెక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న రైతుల్లో చాలామంది ఒక పశువుతో జీవనం సాగిస్తున్నారని, వారి జీవన నైపుణ్యం పెంచేందుకు వెలుగు ద్వారా రెండవ పశువును అందించేందుకు కార్యచరణ సిద్ధం చేయాలని సంయుక్త సంచాలకులు డాక్టర్ బి.మోహన్‌రావు ను ఆదేశించారు. సేంద్రీయ మాంస ఉత్పత్తికి జిల్లాలో దానికి తగిన క్లస్టర్లను, ట్రైబల్ సప్లై మండలాలను గుర్తించి ఒక పైలట్ ప్రాజెక్ట్ మొదలుపెట్టడానికి ప్రణాళిక రూపొందించాలని కోరారు. వేసవికాలంలో ఏర్పడిన పశుగ్రాస కొరతను అధిగమించడానికి పశుగ్రాస ఉత్పత్తికి కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు. లైఫ్ టాక్ సెక్టర్‌లో నిరుద్యోగ యువతలకు ఉపాధి కల్పనకు, వ్యవస్థాపకంలో సంఖ్య పెంచేందుకు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌పై అవగాహన సదస్సులు కల్పించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి రామ్మోహన్‌రావుని ఆదేశించారు. ఈ సమావేశంలో సహాయ సంచాలకులు, వెటర్నరీ అసిస్టెంట్లు సర్జన్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడే పాలిసెట్ పరీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి : పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాల కొరకు నిర్వహించు పాలిసెట్ పరీక్ష-2025 ఈ నెల 30న బుధవారం నిర్వహిస్తున్నట్లు పాలిసెట్ -2025 జిల్లా కోర్డినేటర్, ఐయుఎస్ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను అనకాపల్లి పట్టణంలో 14 కేంద్రాలలోనూ, నర్సీపట్నంలో 9 కేంద్రాలలో వెరసి మొత్తం అనకాపల్లి జిల్లాలో 23 కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనకాపల్లిలో 6,574 విద్యార్థులు, నర్సీపట్నంలో 2448 విద్యార్థులు మొత్తం 9,022 మంది విద్యార్థులు జిల్లాలో పరీక్షకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా హాల్ టిక్కెట్ తీసుకొని రావాలని, పరీక్షకు గంట ముందు పరీక్షా కేంద్రానికి ఉదయం 10 గంటలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 11 తరువాత విద్యార్థులను ఎట్టి పరిస్థితులలోనూ పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించేది లేదన్నారు. బాల్ పాయింట్ పెన్ (బ్లాక్), హెచ్‌బి/2బి పెన్సిల్, ఎరేజరు, షార్పనర్తో రావాలని, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు (టాబ్స్, మొబైల్ ఫోన్స్) క్యాలిక్యులేటర్స్, స్మార్ట్ వాచ్లు పరీక్షా గదిలోనికి అనుమతించడం లేదని తెలిపారు. ఈ సూచనలను తప్పక పాటించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి 1100కు కాల్ చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఫిర్యాదులు నమోదు చేయాలనుకుంటున్నా, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవాలన్నా తక్షణమే 1100 నంబర్‌కు ఫోన్ చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలు తమ సమస్యలను, పెండింగ్ అర్జీల పరిస్థితి తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కాల్ సెంటర్ నెంబర్ 1100 ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి పౌరునికీ కాల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అర్జీదారులు వారి అర్జీ పరిష్కారం కాకున్నా, అర్జీ సంబంధిత వివరములు తెలియకున్నా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అమరావతి పున:ప్రారంభోత్సవానికి తరలిరండి

ప్రజాశక్తి-అనకాపల్లిరూరల్ : అమరావతి పున:ప్రారంభోత్సం కార్యక్రమానికి భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గ పరిశీలకులు బుద్ధ నాగజగదీశ్వరరావు పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్‌రాజా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో అభివృద్ధిలో దూసుకువెళ్లే విధంగా కేంద్ర ప్రభుత్వం అమరావతికి అత్యధికంగా నిధులు కేటాయించినట్లు చెప్పారు.

ఘనంగా తుంపాలమ్మ పండగ

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని అచ్చర్ల గ్రామంలో తుంపాలమ్మ అమ్మవారి పండగ మహోత్సవం, తొమ్మిదో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రమణారావు, నిమ్మదల సన్యాసినాయుడు దొడ్డి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి- కశింకోట : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. కశింకోటలో మంగళవారం ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూమహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెలకువలతో కూడిన శిక్షణ అందించాలని, అది వారి జీవనోపాధికి పూర్తిగా ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. ఎంబ్రాయిడింగ్ శిక్షణ ఇచ్చే విధంగా కషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, వేగి గోపికృష్ణ, ఉల్లింగల రమేష్, నైనంశెట్టి రమణరావు, కలగా సోమేశ్వరరావు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఉల్లింగల రమేష్, వెంకట లక్ష్మీ,కలగ సోమేశ్వరరావు, , అప్పికొండ అప్పారావు మహిళలు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కిశోర వికాసంతో భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి- దేవరాపల్లి : కిశోర వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా సమిష్టి కృషితో చేయూత ఇద్దామని ఐసిడిఎస్ సిడిపిఓ వి.మంగతాయారు అన్నారు. మండల కేంద్రం దేవరాపల్లి వెలుగు కార్యాలయంలో కె.కోటపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ పోలీస్‌సిబ్బంది, విఓఎలకు కిశోర వికాసం వేసవి శిబిరంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల వయస్సు గల బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసుకోకూడదని చెప్పారు. 18ఏళ్లలోపు వివాహాలు చేస్తే పోలీస్‌స్టేషన్లో గానీ, ఐసిడిఎస్ అధికారులకు గానీ సమాచారం అందించాలని సూచించారు. గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి కమిటీ కన్వీనర్‌గా అంగన్వాడి కార్యకర్త, ఎంఎల్‌హెచ్‌పి/ ఏఎన్ఎం, విఓఎ , ఆశాలు సభ్యులుగా ఉండి పని చేయాలన్నారు. బాలికల్లో ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ప్రభాకరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎం.రాములమ్మ, ఎన్.కళ్యాణి, జి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలంలో దిబ్బిడి, బుచ్చయ్యపేట, కండిపూడి, రాజాం తదితర గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4గంటల తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురుగాలులు, పిడుగులు శబ్ధం, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో వర్షం కురవడంతో మామిడికి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

కోట్ని బాలాజీకి అభినందన

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం 10 మంది డీసీఎంఎస్ చైర్మన్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేయగా విశాఖ జిల్లా నుంచి బాలాజీకి అవకాశం దక్కడం పట్ల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఆయనకు శుభాభినందనలు తెలియజేశారు. ఈ పదవి రావడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



చంద్రబాబుతో కోట్ని బాలాజీ

గ్రామీణ ప్రాంత ఆర్థికాభివృద్ధికి బ్రాండిక్స్ ఊతం

టిటిడి చైర్మన్ బిఆర్.నాయుడు



బ్రాండిక్స్ గురించి తెలియజేస్తున్న దొరైస్వామి

ప్రజాశక్తి-అచ్యుతాపురం


వేలాదిమంది గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తూ, గ్రామీణ ప్రాంతాల పారిశ్రామిక, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఊతమిందని, ఇది ఎపికి తలమానికమని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) చైర్మన్ బిఆర్.నాయుడు అన్నారు. మంగళవారం ఆయన బ్రాండిక్స్ సంస్థను సందర్శించారు. గ్రామీణ మహిళలకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు, వస్త్రాల తయారీ, ఎగుమతి విధానాలు, ఉద్యోగులకు అందిస్తున్న సౌకర్యాలు, సేవా కార్యక్రమాలను బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరైస్వామి ఆయనకు వివరించారు. బి.ఆర్.నాయుడు సంస్థలో మహిళా ఉద్యోగులతో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రాండిక్స్ సంస్థలో ఒకే చోట 20 వేల మంది గ్రామీణ మహిళలు పని చేయడం అభినందనీయమన్నారు. తక్కువ విద్యార్హత కలిగిన నిరుపేద మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రపంచస్థాయి బ్రాండ్‌లకు వస్త్రాలను ఎగుమతి చేయడంలో వారిని భాగస్వాములను చేయడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రకతి పరిరక్షణకు బ్రాండిక్స్ సంస్థ యాజమాన్యం ఇస్తున్న ప్రాధాన్యత, మొక్కల పెంపకంపై తీసుకుంటున్న శ్రద్ధను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్రాండిక్స్ ఇండియా హెడ్ ఉదయ పెరేర, జనరల్ మేనేజర్లు, అన్ని యూనిట్ల హెచ్.ఆర్ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రయివేటు స్కూళ్లలో ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - సబ్బవరం : ప్రైవేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ఎంఈఓలు లక్ష్మణరావు, ఎంజె. రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం-2009, సెక్షన్ 12(1)సి ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న పిల్లలు (అనాథలు, హెచ్ఐవి భాదితులు, విభిన్న ప్రతిభావంతులు ఎస్సీ, ఎస్టి, ఓబీసీ వర్గాల పిల్లలకు సబ్బవరం మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలలో ఈ నెల 28 నుండి మే 15 వరకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలకు చెందిన పిల్లల నుండి 25 శాతం కోటా కింద ప్రవేశం పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు వారి ఆధార్‌కార్డు ప్రాథమిక వివరాలతో https://cse.ap.gov.in వెబ్‌సైట్ నందు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. సంబంధిత గ్రామ సచివాలయం/ మండల విద్యా వనరుల కేంద్రం సబ్బవరం లేదా సంబంధించిన పాఠశాల నుంచి కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

గాంధీ మార్కెట్లో సినిమా షూటింగ్ సందడి

ప్రజాశక్తి-అనకాపల్లి : 'అనకాపల్లి' టైటిల్‌పై ప్రముఖ చిత్ర దర్శకులు నక్కిన త్రినాధరావు, భవ్యశ్రీ అధినేత కాండ్రేగుల నాయుడు నిర్మాణ సారధ్యంలో ఖగేష్ తమ్మినేని దర్శకత్వంలో చేస్తున్న సినిమా షూటింగు అనకాపల్లి పట్టణంలో సందడిగా మారింది. అనకాపల్లిలోని పలు ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నారు. మంగళవారం గాంధీ కూరగాయల మార్కెట్లో ఒక పాటకు సంబంధించిన షూటింగ్ జరిగింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత నక్కిన త్రినాధరావు మాట్లాడుతూ కల్ట్ లవ్ స్టోరీ (పట్టణంలో జరిగే ప్రేమ కథ) ప్రధాన ఇతిహాసంగా ఈ చిత్రం నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే 70శాతం షూటింగ్ పూర్తి అయిందని, మిగిలిన 30శాతం పూర్తిచేసి దసరాకు సినిమాను రిలీజ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గౌరీ సంఘం, శారదా బ్రిడ్జి, మార్కెట్ తదితర ప్రాంతాల్లో షూటింగ్ జరిగిందన్నారు. ఈ చిత్రంలో హీరోగా విక్రమ్, హీరోయిన్‌గా సంధ్య, కమెడియన్‌గా బాషా నటిస్తున్నారన్నారు. అద్యంతం వినోద భరితంగా ఈ చిత్రం సాగుతుందని చెప్పారు.



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

ముగిసిన పాలిటెక్నిక్, ఎపిఆర్‌జెసి శిక్షణ

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను, గంగవంశం సంతోష్ ఆధ్వర్యంలో దేవరాపల్లి ఉషోదయ పాఠశాలలో ఈనెల 4 నుంచి ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్, ఎపిఆర్‌జెసి ఉచిత శిక్షణ మంగళవారంతో ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. ముగింపు రోజున ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.విరమణ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో 2018 నుంచి ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు మంచి ర్యాంకులు తెచ్చుకుని, తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. 24 రోజులు కోచింగ్ ఏర్పాటుకు సహకరించి, ఉషోదయ పాఠశాల ఇచ్చినందుకు స్కూలు యాజమాన్యం పెద్దాడ వెంకటరమణ, వేచలపు అప్పలనాయుడులకు సన్మానించారు. కార్యక్రమంలో గంగవంశం సంతోష్ , ఉప్పు అజయ్, గుల్లిపల్లి రవి విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రకు పాల ఉత్పత్తిదారులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ములకలపల్లి గ్రామానికి చెందిన పాలఉత్పత్తిదారులు మంగళవారం విజ్ఞానయాత్రకు విశాఖ వెళ్లారు. ఈ యాత్రలో భాగంగా విశాఖ డెయిరీని సందర్శించి, అక్కడ పాల నుంచి తయారయ్యే ఉత్పత్తుల గురించి తెలుసుకోనున్నారు. పాల సరఫరాదారులను ఉచితంగా విజ్ఞాన యాత్రకు తీసుకెళుతున్నామని పాల సొసైటీ అధ్యక్షుడు సంజీవి, కార్యదర్శి ప్రసాదరావు, డెయిరీ సూపర్‌వైజర్ కృష్ణ, డిఈడబ్ల్యూ రమేష్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ అధ్యాపకులకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణంలో పౌర్ణమి సేవా సంస్థ వ్యవస్థాపకులు టిడిపి పట్టణ అధ్యక్షులు డాక్టర్ కేకెవిఎ నారాయణరావు ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ అధ్యాపకులను మంగళవారం సత్కరించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ ముఖ్య అతిథులుగా పాల్గొని సత్కరించారు. పేద ఉద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పట్టణ సీఐ విజయ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ పనులపై విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-యలమంచిలి

మండలంలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులపై పిఆర్.విభాగం విజిలెన్స్ విభాగం మంగళవారం తనిఖీలు చేపట్టింది. మండలంలో చేపట్టిన సిసి రోడ్లు, కల్వర్టులు, మట్టిరోడ్లు మొదలైన పనులకు ఇంతవరకూ నగదు చెల్లించలేదు. వాటిని చెల్లించడానికి జరుగుతున్న ప్రక్రియలో భాగంగా పి.ఆర్.విభాగం విజిలెన్స్ విభాగం తనిఖీలు చేపట్టింది. పురుషోత్తపురంలో చేపట్టిన సిసి రోడ్లను విజిలెన్స్ విభాగం డిఈ శ్రీనివాస్ మాట్లాడుతూ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆరుగురు తనిఖీ అధికారులు పాల్గొన్నారు. కొత్తగా నిర్మించిన సిసి రోడ్డు నమూనాలు తీసుకున్నారు. లాబ్‌లో పరిశీలన అనంతరం రిపోర్టు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక పిఆర్ ఏఈ సోమశేఖర్ తదితరులు ఉన్నారు.



పనులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నిర్వీర్యమవుతున్న ఆర్‌టిఐ చట్టం

- కావాలనే తప్పుదోవ పట్టిస్తున్న సమాచార అధికారులు

- పట్టించుకోని అప్పిలేట్ ఆఫీసర్లు

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలిలో సమాచార హక్కు చట్టాన్ని అధికారులు నిర్వీర్యం చేస్తున్నారు. దరఖాస్తుదారులకు కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటున్నారు. సమాచారహక్కు చట్టం-2005 సెక్షన్ 6 (3) ప్రకారం ఇవ్వాల్సిన సమాచారాన్ని ఇవ్వకుండా నొక్కి పెడుతున్నారు. ఇది నిర్లక్ష్యమా? లేక ఏమీ చేయలేరులే అన్న ధీమానా?

యలమంచిలి మున్సిపాలిటీ ఎర్రవరం రెవెన్యూ పరిధిలో డి-పట్టా భూములు గత నాలుగేళ్లలో ఎంతమందికి ఇచ్చారని వేగి వెంకట్రావు అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయేషాకు 2025 మార్చి 25న దరఖాస్తు చేశారు. స్పందించిన ఆమె యలమంచిలి డిప్యూటీ తహశీల్దార్‌కు ఆ పని అప్పగించి దరఖాస్తుదారుకు సమాచారం ఇచ్చి తనకు కూడా ఒక కాపీ పంపాలని 2025 మార్చి 28న ఆదేశాలిచ్చారు. కాని ఇంత వరకు డిప్యూటీ తహశీల్దార్ సదరు దరఖాస్తుదారునికి సమాచారం ఇవ్వలేదు.

యలమంచిలి గ్రామీణ ప్రాంతం ఏటికొప్పాకలో ఇసుక అక్రమంగా తవ్వి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారని, వాటికి అనుమతులేమైనా ఇచ్చారా అని ఆర్టీఐ హక్కు చట్టం ద్వారా 2024 జూలైలో తులసీనగర్ ప్రాంతానికి చెందిన వేగి వెంకట్రావు దరఖాస్తు చేశారు. దానికి డిప్యూటీ తహశీల్దార్ సమాధానమిస్తూ... గ్రావెల్ తరలించడానికి ఎవరికీ పర్మిషన్ ఇవ్వలేదని జవాబు ఇచ్చారు. అక్కడ ఇసుక తవ్వకాల గురించి అడిగితే విషయాన్ని దాటవేసే పద్ధతిలో గ్రావెల్ తవ్వకాలకు పర్మిషన్ ఇవ్వలేదని జవాబు ఇవ్వడంపై దరఖాస్తుదారుడు అసంతృప్తి వ్యక్తం చేశారు.

మున్సిపాలిటీ పరిధిలోని సోమలింగపాలెంలో 180, 189 సర్వే నెంబర్లలో నిర్మించిన ఇళ్లకు అసెస్‌మెంట్ నెంబర్లు ఇచ్చారు. ఆ ఇళ్ల భూమి హక్కు పత్రాలు, ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చిన పర్మిషన్, ప్లాన్ వివరాల కోసం 2025 మార్చి 24న దరఖాస్తు చేస్తే సర్వేయర్‌ను పంపి హడావిడి చేసి ఇంత వరకూ జవాబివ్వలేదని సమాచార హక్కు చట్టం కార్యకర్త వంశీకృష్ణ వాపోయారు. అక్కడ ఆక్రమణ భూమిలో ఇళ్లు నిర్మించగా, టౌన్ ప్లానింగ్ అధికారులు అసెస్‌మెంట్ నెంబర్లు ఎలా కేటాయించారో అర్థం కావడం లేదని వంశీకృష్ణ టౌన్ విభాగం వారిని తప్పుపడుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహార శైలికి మరో సాక్ష్యం ఏమిటంటే... సోలింగపాలెంలో ఎన్ని బావులు ఉన్నాయో సమాచార హక్కు చట్టం కార్యకర్త వేగి వెంకటరావు దరఖాస్తు ద్వారా కోరితే 5 చెరువులున్నాయని జవాబిచ్చారు. మరో మూడు నెలల తర్వాత అదే ప్రశ్నను మరో సమాచార హక్కు చట్టం కార్యకర్త వంశీకృష్ణ దరఖాస్తు ద్వారా కోరితే 2 బావులు ఉన్నాయని



జవాబిచ్చారు. దీన్ని బట్టి చూస్తే జవాబులిచ్చే వ్యక్తులు ఎంత బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారో తేట తెల్లమౌతోంది.

మున్సిపల్ టౌన్ ప్లానింగ్‌లో ఎన్ని దారుణ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయో చెప్పాల్సి వస్తే.. ధర్మవరం వీధిలో ఒక సోషల్ ఆర్గనైజేషన్ రెండు కమర్షియల్ షాపులు నిర్మించింది. వాటికి పర్మిషన్లు లేవు. వాటికి పర్మిషన్ ఉన్నట్లు తప్పుడు కాగితాలు సృష్టించి ఆ ఆర్గనైజేషన్ చేతిలో పెట్టి డబ్బులు గుంజేశారు. కమిషనర్‌ను ప్రశ్నిస్తే అబ్బే వాటికి పర్మిషన్‌లు లేవని ప్రజాశక్తికి కుండ బద్దలు కొట్టి మరీ చెప్పారు. ఇదీ ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం అమలు జరుగుతున్న తీరు, ఆ చట్టం పట్ల ప్రభుత్వ అధికారులకు ఉన్న గౌరవ మర్యాదలు. స.హ.చట్టాన్ని సమాచార అధికారులు నిర్వీర్యం చేస్తున్నా అప్పిలేట్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలపై ధర్నా

సిఐటియు మద్దతు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సిహెచ్‌ఓ)ల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఆరు సంవత్సరాలు దాటిన ప్రతి సిహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని, ప్రతి సంవత్సరం 5శాతం ఇంక్రిమెంట్, పని ఆధారిత ప్రోత్సాహకాలు, ఈపీఎఫ్ఓ పునరుద్ధరించాలని, ఎఫ్ఆర్ఎస్ నుండి సిహెచ్‌ఓలను మినహాయించాలని వారు డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా కోశాధికారి, ఏపీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వివి. శ్రీనివాసరావు సంపూర్ణ మద్దతును తెలియజేసి మాట్లాడారు. సిహెచ్‌ఓల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం డిఆర్ఓ సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓలు జి భవాని, పి రేవతి, జి యమున, కె అశ్విని, టి కళ్యాణి, జిల్లాలోని 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిహెచ్వోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ల్యాబ్ పనులకు శంకుస్థాపన



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న ల్యాబ్ నిర్మాణానికి చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాకారపు నాగేశ్వరి దేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు గోకువాడ కోటేశ్వరరావు స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి, డొంకిన అప్పలనాయుడు, ఎంవివి సత్యనారాయణ, కోటా సత్యనారాయణ, దొడ్డి కిషోర్ సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

విశాఖ-పెద్దమదిన మధ్య బస్సును పునరుద్ధరించాలని కొండపాలెం సర్పంచ్ ముచ్చకర్ల తాతీలు ఎమ్మెల్యే రాజుకు విజ్ఞప్తి చేశారు. రోడ్లు మరమ్మతుల కారణంగా కొద్దిరోజులుగా బుచ్చయ్యపేట, కెపి అగ్రహారం, కొండపాలెం మధ్య అధికారులు బస్సును నిలిపివేశారని, దీంతో పైగ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనకాపల్లి రాజాం, బుచ్చయ్యపేట, దిబ్బిడి, వడ్డాది మీదుగా చోడవరం వరకు ఆర్టీసీ బస్సులు ప్రారంభించాలని కందిపూడి మాజీ సర్పంచ్ ద్వారపురెడ్డి అప్పలనాయుడు కోరారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన బుచ్చిరాజు



డిప్యూటీ స్పీకర్‌తో బుచ్చిరాజు

ప్రజాశక్తి- సబ్బవరం: విశాఖలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఎపి అసెంబ్లీ డిప్యూటి స్పీకం రఘురామ కృష్ణంరాజును అనకాపల్లి జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, వాకాడ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ అప్పారావు నాయుడుకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పరిధిలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ, ఉత్తమ ఫలితాల సాధనకు విశేష కృషి చేసిన అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడును నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం మంగళవారం ఘనంగా సత్కరించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీనుబాబు సత్కరించి, అభినందించారు. డిఇఒగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి 10వ తరగతి సిలబస్ పూర్తి చేయించడంలోనూ, ప్రత్యేకత నిర్వహించడంలోనూ ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. జిల్లాలో ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహణలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కోట్నీ రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి కృష్ణంరాజు, జిల్లా ఉపాధ్యక్షులు రాజా రమేష్, బుచ్చియ్యపేట మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాయుడు, లోకేష్, చోడవరం మండల ప్రధాన కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీ వజ్రోత్సవంలో కొండెంపూడి రైతులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాలు (డైమండ్ జూబ్లీ) గుంటూరు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఫారంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో కొండెంపూడి కృషి విజ్ఞానకేంద్రం పరిధిలో పలువురు రైతులు పాల్గొన్నారు. అక్కడ కొన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. వ్యవసాయ ఉత్పత్తుల సాగు తదితర అంశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొండెంపూడి కషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాజకుమార్, కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, సుతపల్లి సర్వేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో గర్నికం కెజిబివి జూనియర్ కాలేజీ విభాగం అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంగళవారం చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్. రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ గర్నికంలోని కెజిబివి వసతి సమస్యను గ్రామ పార్టీ నాయకులు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ జగన్నాథం, పలువురు తన దృష్టికి తేగా, వెంటనే స్పందించి కస్తూర్బా పాఠశాల ఇంటర్మీడియట్ విభాగానికి అదనపు గదుల నిర్మాణానికి రూ.ఒక కోటి 43 లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు. పాఠశాల అభివృద్ధికి విద్యా కమిటీ ఛైర్మన్ జగన్నాథం చేస్తున్న కృషి, చొరవను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ జగన్నాథం, పెద్దేరు రిజర్వాయర్ వైస్‌చైర్మన్ గోవిందు, స్థానిక సర్పంచ్ గెంజి మోదినాయుడు, మరుపాక ఎంపిటిసి సూర్యనారాయణ, మాజీ ఎంపిటిసి జర్రిపోతుల రాంబాబు, మరుపాక ఆదర్శ పాఠశాల ఛైర్మన్ కాశెట్టి రాజు పాల్గొన్నారు.



వంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజు

రోలుగుంట : స్థానిక కస్తూర్బా విద్యాలయం జూనియర్ కళాశాలలో అదనపు భవన నిర్మాణాలకు చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు మంగళశారం శంకుస్థాపన చేశారు. రూ.1.64 కోట్లతో అదనపు భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన లగుడు హర్షిత, గాలి కౌశల్యలను ఘనంగా సత్కరించారు. కెజిబివిలో శతశాతం ఉత్తీర్ణత సాధించడంపై ఎస్ఒ తులసిని అభినందించారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఇఇ డివి.నరసింహారావు, డిఇఇ ఎన్.సుబ్బలక్ష్మి, ఎఇఇలు సత్యనారాయణ, మూర్తి, ఎంఇఒ జగ్గారావు, మండల నాయకులు, ఎంపిటిసి సుర్ల రామకృష్ణ, పార్టీ అధ్యక్షులు గుములూరు చంద్రమౌళి, పంచాడ చంద్ర పాల్గొన్నారు.

వైసిపి నేతల అక్రమ అరెస్టులు దుర్మార్గం



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెలే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : 2019లో జరిగిన సంఘటన ఆధారంగా ఆరేళ్ల తర్వాత తమ పార్టీ నాయకులపై కేసులు పెట్టి అరెస్టు చేశారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

మంగళ వారం మాట్లాడుతూ 2019లో నాటి సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై టిడిపి కార్యకర్త లక్ష్మణ్ వీడియోలో అనుచితంగా మాట్లాడారని అప్పట్లో తమ నాయకులు అతనిని మందలించారన్నారు. దీనిపై నర్సీపట్నం ఐటిడిపి కార్యకర్త నల్లబెల్లి స్వామి అనకాపల్లి జిల్లాలో యాదవ కులానికి చెందిన లక్ష్మణ్ తన కుమారుడికి చంద్రబాబు పేరు పెట్టుకున్నాడని వైసిపి నేతలు దాడి చేశారంటూ మంత్రి నారా లోకేష్‌కు ట్వీట్ చేయడంతో, ఇపుడు అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు.

టిడిపి గ్రామ కమిటీల నియామకం

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని గొడిచెర్ల గ్రామంలో మాజీ వైస్ ఎంపిపి, టిడిపి నేత వైబోయిన రమణ ఆధ్వర్యంలో టిడిపి గ్రామ కమిటీ నియమించారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా నల్లల నారాయణరావు, ఉపాధ్యక్షులుగా మొల్లి నాగరాజు, మిగతా కమిటీ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా పార్టీమండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, గింజాల లక్ష్మణరావు, వెలగా శ్రీనివాసరావు పాల్గొని కొత్త కమిటీ సభ్యులను అభినందించి సత్కరించారు. గ్రామంలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా పనిచేయాలని సూచించారు.

మాడుగుల : మండలంలో నాలుగు గ్రామాల్లో టిడిపి గ్రామ శాఖ అధ్యక్ష,కార్యదర్శులను ఎన్నుకున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు తెలిపారు. జంపెన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా యన్నంశెట్టి కొండలరావు, కార్యదర్శిగా రాకోటి చిన్నోడు, ఎల్. పొన్నవోలు అధ్యక్షుడిగా యన్నంశెట్టి సత్యారావు, కార్యదర్శిగా గండిపడల రమేష్ బాబు, జాలంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బాణం భీమలింగేశ్వరావు, కార్యదర్శిగా బచ్చల కన్నయ్య దొర, సత్యవరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జెర్రిపోతుల సూర్యనారాయణ, కార్యదర్శిగా జాజుల శ్రీనులను ఎన్నుకున్నారు. మాడుగుల నియోజకవర్గ పార్టీ పరిశీలకులు ఏసుదాస్ ఆధ్వర్యంలో గ్రామకమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కార్యక్రమంలో కెజె.పురం ఎంపిటిసి భీశెట్టి శ్రీనివాసరావు, తెలుగు యువత మండల అధ్యక్షులు వడ్డి రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి పుప్పాల రమేష్ పాల్గొన్నారు.



మాడుగులలో కొత్త కమిటీకి నేతల అభినందన

ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరాలు



నర్సీపట్నంలో మాట్లాడుతున్న జెవివి నేత త్రిమూర్తులు రెడ్డి

ప్రజాశక్తి కోటవురట్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు, విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాని సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్ పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం ఫోటీలు నిర్వహించారు. విద్యార్థులు దేశానాయకుల చిత్రాలు, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి అందాల దృశ్యాలు, , భూమిని రక్షించడం, పక్షులు,పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన పర్యావరణం వంటి చిత్రాలను గీశారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని, విజేతలకు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని జనార్ధన్ తెలిపారు.

శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి

నర్సీపట్నం టౌన్ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులురెడ్డి అన్నారు. మంగళవారం నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పిదమయంతి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞానం శిబిరంలో మాట్లాడుతూ, అంతా సైన్స్‌తోనే ముడిపడి ఉందన్నారు. అనంతరం పలు సైన్స్ మ్యాజిక్ ఐటమ్స్ చేసి చూపించి విద్యార్థులకు నేర్పించారు. ప్రారంభంలో గురజాడ అప్పారావు దేశభక్తి గీతాన్ని విద్యార్థులకు నేర్పించి, భావాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులలో సృజనాత్మకతను పెంచే విధంగా సీహెచ్.భవానీ కథలు చెప్పి ఆలోపింపజేశారు. పి.ప్రభాకర్ ఇండోర్ గేమ్స్ ఆడించారు. రెండోరోజు క్యాంపులో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కథలు సమాజానికి ప్రతిబింబాలు

ములగాడ : సమాజంలో జరుగుతున్న వివిధ రకాల విషయాలను తెలుసుకోవాలంటే అనేకమంది రచయితలు రాస్తున్న కథలను చదవడం ఎంతో అవసరమని ప్రముఖ చిత్రకారులు కళారత్న సుంకర చలపతిరావు అన్నారు. శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో మాట్లాడుతూ, విద్యార్థులు రోజుకు కనీసం ఒక కథను చదివి, అందులోని సందేశాన్ని ఒక డైరీలో రాసుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. జ్యోతిర్మయి ఆధ్వర్యాన విద్యార్థులకు నృత్యంలో మెళకువలను నేర్చుకున్నారు. జగదాంబ, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, నీతి కథలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక పాఠకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనకాపల్లి : తుమ్మపాల శాఖా గ్రంథాలయంలో మంగళవారం సమ్మర్ క్యాంప్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ అంశాలను నేర్పించారు. కార్యక్రమానికి సంస్కృతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ జి.సత్యకుమార్, దిబ్బపాలెం స్కూల్ అసిస్టెంట్ ఏవివి సత్యనారాయణ, సంస్కృతి స్కూల్ ఉపాధ్యాయురాలు నీలిమ పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి



అనకాపల్లి గ్రంథాలయంలో పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థులు

గెడ్డ పోరంబోకు ఆక్రమణపై విచారణ

పిజిఆర్ఎస్ ఫిర్యాదుకు అధికారుల స్పందన



విచారణ చేపడుతున్న రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో సుంకపూరు గ్రామం ప్రధాన రహదారిని అనుకుని అడవి రాజులబాబు గుడి వెనక భాగంలో సర్వేనెం 202లో 40 సెంట్లు భూమి చిటికెల భాస్కరరావు ఆక్రమించారంటూ జనసేన మండల అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాస్ సోమవారం నర్సీపట్నంలో జిల్లా కలెక్టర్ నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు, దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ శ్రీనివాస్, విఆర్ఒ పెద్దన్నదొర విచారణ చేపట్టారు.

ఈ సందర్భంగా ఫిర్యాదారుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో అనేకసార్లు తహసిల్దార్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ బోరుబావిని ఆక్రమించుకుని, ఆ స్థలంలో జీడిపిక్కల ఫ్యాక్టరీ ఏర్పాట్లు చేస్తున్నారని ఫిర్యాదు చేశామన్నారు, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరామన్నారు, రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కోరారు.

రీ సర్వే పక్కాగా చేపట్టాలి



సర్వే పరిశీలిస్తున్న తహశల్దార్ నరసింహమూర్తి

ప్రజాశక్తి -నక్కపల్లి : భూముల రీ సర్వే పక్కాగా చేపట్టాలని తహశీల్దార్ నరసింహామూర్తి సర్వే బృందానికి సూచించారు. మంగళవారం మండలంలోని చినరామభద్రపురం గ్రామంలో. రెవెన్యూ సిబ్బంది చేపడుతున్న భూముల రీ సర్వే ను పరిశీలించారు. వారికి తగు సూచనలు చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేపట్టాలన్నారు.కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నాతవరం మండలం సుందరకోట ప్రాంతంలో లేటరైట్ పేరుతో బాక్సైట్‌ను అక్రమ తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని బిఎస్‌పి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొట్టా నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ ఈ నెల 23 అర్ధరాత్రి నుంచి అక్రమ మైనింగ్ తవ్వకాలు ప్రారంభించారని, దీని వల్ల పర్యావరణానికి హాని కలగడమే కాకుండా స్థానిక ఆదివాసీల జీవన మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉందన్నారు. గతంలో లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వుకుపోతున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారని, ఇపుడు అదేచోట జరుగుతున్న తవ్వకాలు ఎలా సక్రమమౌతాయని ప్రశ్నించారు.దీనిపై రాష్ట్రవ్యాప్త ఆందోళనతోపాటు పార్లమెంట్‌లో ఎంపీ రాంజీ గౌతమీతో సమస్య లేవనెత్తుతామన్నారు. దీనిపై న్యాయస్థానానికి వెళతామన్నారు.

ఘనంగా పోలేరమ్మ పండగ

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో లింగాపురం గ్రామంలో మంగళవారం పోలేరమ్మ తల్లి పండ ఘనంగా నిర్వహించారు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు, ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు, ఈ సందర్భంగా జిల్లా స్థాయి గుర్రపు పందెం పోటీలు నిర్వహించారు, చోడవరానికి చెందిన గుర్రం ప్రథమ బహుమతి సాధించగా రూ.12 వేల బహుమతి అందజేసారు. ద్వితీయ బహుమతి రూ.పదివేలు, తృతీయ బహుమతి రూ.8000 చొప్పున అందజేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

దళితులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి

ప్రజాశక్తి- నక్కపల్లి : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్లులోపు నెలసరి వాడకం ఉన్న దళితులకు ఇచ్చిన బిల్లులను రద్దుచేసి, ఉచిత విద్యుత్ అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి రాజేష్ డిమాండ్ చేశారు. మంగళవారం డొంకాడ గ్రామానికి వెళ్లి దళితుల కరెంట్ బిల్లులను పరిశీలించారు. ప్రస్తుత విద్యుత్ బిల్లును వచ్చేనెల 13లోగా చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామని విద్యుత్‌శాఖ అధికారులు హెచ్చరించినట్లు దళితులు ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 60,70 యూనిట్లుకు మించి వాడకం లేదని, ఈ నేపథ్యంలో వారికిచ్చిన విద్యుత్ బిల్లులు వెనక్కు తీసుకుని, ఉచిత విద్యుత్ అమలు చేయాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో యుఆనందరావు, ఇ.సత్యనారాయణ, నూకేష్, అప్పారావు, సత్యవతి, కుమారి, అప్పలనర్స తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులు చూపుతున్న డొంకాడ దళితులు

ఆరుగురికి మలేరియా

డిఎంఒ ఆదేశాలతో నేరేడుబందలో వైద్యశిబిరం



నేరేడుబందలో వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ నేరెళ్లబంద గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న గిరిజనులకు జిల్లా మలేరియా అధికారి ఆదేశాలతో మంగళ వారం కొత్తకోట పిహెచ్‌సి వైద్యసిబ్బంది సేవలు అందించారు. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి, జ్వరాలతో బాధపడుతున్న వారికి ఆర్‌డిటి కిట్లుతో రక్తపరీక్షలు చేయగా, ఆరుగురికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. గ్రామంలో ఇంటింటా దోమల నివారణకు ఐఆర్ఎస్ మందు పిచికారీ చేయించారు. దోమల నివారణకు తగు సూచనలు చేయడంతోపాటు దోమతెరలు వాడాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి రమణ సూచించారు కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాలొన్నారు.